విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

"జగనన్న ఆరోగ్య సురక్ష" సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర-టంగుటూరు : ప్రజలు "జగనన్న ఆరోగ్య సురక్ష" క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వల్లూరు గ్రామంలో ఒకటవ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారి వివరాల నమోదు, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలు, ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్యులు, తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వేల మందికి ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయ న్నారు. ఈ క్యాంపులలో నిపుణులైన వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కంటి వెలుగు క్రింద కూడా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల అవసరాలకు తగినట్లుగా స్థానికంగానే సచివాలయ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను కూడా ఉచితంగానే ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల అనారోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన వారిని జి.జి.హెచ్, వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు పంపిస్తున్నామన్నారు. ఎక్కువ శాతం బీపీ, షుగర్ రోగులు వస్తున్నారన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా వాలంటీర్లు, ఎ.ఎన్.ఎం.లు, ఆశాలు, అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి.ఎం.హెచ్.ఓ. రాజ్యలక్ష్మి, ఎం.పి.డి.ఓ. వనజాక్షి, తహశీల్దార్ సంజీవరావు, స్థానిక వైద్యులు,

వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు వల్లూరులోని స్థానిక వల్లూరమ్మ దేవాలయంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తో కలిసి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు, ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి అన్నారు. రెండవ రోజు బుధవారం మండలంలోని గొట్లగట్టు పంచాయితీ పరిధిలోని వెలుగొండరాయిని పల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరికీ సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అందరు బాగున్నారా సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అందరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం సంక్షేమ పథకాల కరదీపికలను ఇంటి యజమానులకు అందజేశారు. గడపగడపకు వచ్చిన ఎమ్మెల్యేను వైసీపీ నాయకులను గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులు రెడ్డి ఎంపీపీ మురళీకృష్ణ జడ్పీటీసీ సభ్యుడు ఏడుకొండలు వైసీపీ కన్వీనర్ ఎం శంకర్ రెడ్డి మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

శనగ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని దద్దవాడ గ్రామ రైతు భరోసా కేంద్రం ఆవర ణలో సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం జడ్పీటీసీ సారె వెంకటనాయుడు, సర్పంచ్ భూమా రమణమ్మ, ఎంపీటీసీ దూదేకుల నాగమ్మ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 నుండి వ్యవసాయశాఖ ద్వారా ప్రతి రైతు భరోసా కేంద్రాలలో సబ్సిడీ పైన విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుంది. గత సంవత్సరాల కన్నా భిన్నంగా ఈ సంవత్సరం 2023-24లో శనగ విత్తనాలు 1 ఎకరా పొలం విస్తీర్ణంకి 40 కేజీల విత్తనాలు (గరిష్టంగా 5 ఎకరాలు వరకు) పంపిణీ చేయడం జరుగుతుంది. అదేవిధంగా ఈ సంవత్సరం గత సంవత్సరాల కన్నా అధికంగా 40 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్క రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి. బాలాజీ నాయక్, కొమరోలు మండల వ్యవసాయాధికారి కె.రాజశ్రీ, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-మార్కాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను మార్కాపురంలోని రెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో శ్రీ రెడ్డి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దొనపాటి సాయి లక్ష్మి, వేమన డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాప కులు జంకె సుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు ఏనుగుల రవికుమార్, వడ్డే రవికాంత్, ఓబినబోయిన రామాంజనేయులు, గోనావత్ ప్రతాప్ నాయక్, కళాశాల సిబ్బంది చుక్క నాగేశ్వరగౌడ్, గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సైన్స్ సంబరాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలలో 8,9,10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొంటారని తెలియ జేశారు. పాఠ శాల పరీక్ష నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెం బర్ 17న రాష్ట్రస్థాయి జనవరి 27,28 తేదీలలో జరుగుతుందని తెలియజేశారు.

గుళికలమందు ప్రభావంతో యువకుడికి అస్వస్థత

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్ర మైన ముండ్లమూరులో పొలానికి గుళికల మందు కొడుతూ సంతాపరపు వెంకటేశ్వర్లు అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన రైతు పొలంలో పవర్ స్ప్రేతో గుళికల మందు పిచికారి చేస్తుండగా ఆ సమయంలో జేబులో ఉన్న బీడీ కట్టపై గుళికల మందు నీరు పడడంతో బీడీ కట్ట తడిసిపోయింది. దీంతో చూసుకోకుండా యువకుడు మధ్యలో మందు ట్యాంకీ ఆపి బీడీకి అగ్గి ముట్టించుకుని తాగాడు. అస్వస్థత గురై పడిపోవ డంతో భూమి యజమాని 108కి సమాచారం ఇవ్వడంతో తాళ్లూరులో అందుబాటులో ఉన్న పైలెట్ నరేష్ హుటాహుటిన ముండ్లమూరులోనే ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో కొలువైన ఈశ్వరీదేవి అమ్మవారు దసరా నవరాత్రుల సందర్భంగా బుధవారం ధనలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త పూజారి భైరవానంద స్వామి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, ధూప, దీప మహా నైవేద్యాలు, మహిళలచే కుంకుమార్చనలు జరిపించారు. గురువారం శాకాంభరీ దేవిగా దర్శనం ఇవ్వనున్నట్లు భైరవానంద స్వామి తెలిపారు.

రాష్ట్ర సదస్సుకు తరలి వెళ్లిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రాష్ట్ర సదస్సుకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి, డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం దోర్నాల నుండి కడపలో జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు సీపీఐ నాయకులు తరలి వెళ్లి రాష్ట్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవి కృష్ణ గౌడ్ బానాల రామయ్య,, సీపీఐ కార్యదర్శి విశ్వరూప ఆచారి, తిరుమలయ్య, దోర్నాల మండలం సీపీఐ నాయకులు దోర్నాల మండల సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు శాఖ గ్రంథాలయంలో కథల పోటీలు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక శాఖ గ్రంథాల యంలో గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు చదవడం మా కిష్టం కార్యక్రమంలో మూడవ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమం అనింద్రారెడ్డి ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో విద్యార్థులకు కథలు చెప్పడం, చెప్పిం చడం లాంటి కార్యక్రమం చక్కగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. కావున నేడు నిర్వహించబోయే క్విజ్ లో కూడా ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతో చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడుతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికి తిరిగి కరపత్రాల కార్యక్రమం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలం పెద్ద బొమ్మలపురం గ్రామంలో బాబుతో మేము ఇంటింటికి తిరిగి కరపత్రాల కార్యక్రమం మూడవ రోజు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు డోర్ టు డోర్ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టును అరెస్టును ప్రజలకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రావికింది సుబ్బా రత్నం, మల్లారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే మహా భాగ్యం

శీమంతంలో పాల్గొన్న సర్పంచ్ కుమారి, ఎంపీడీఓ నాయక్.

విశాలాంధ్ర-దొనకొండ: రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే మహా భాగ్య మని ఎంచి జగనన్న ప్రభుత్వం ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని చేపట్టిందంటూ సర్పంచ్ ఎగ్గోని కుమారి, ఉప సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో వారు పాల్గొని ప్రజలకు జరుగుతున్న వైద్య పరీక్షలు పరిశీలించారు. అంగన్‌వాడీలు తయారు చేసిన పోషకాహారాన్ని రుచి చూసి, గర్భిణీలకు చేసిన శీమంతంలో అంక్షితలు వేసి ఆశీర్వదించారు. అనంతరం అధికారులకు, గ్రామస్తులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, వైద్యురాలు యం.సునీత, పంచాయతీ కార్యదర్శులు షుక్కూరు, యం.శ్రీనివాసులు, వైసీపీ నాయకులు వెర్రి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవన్ కుటుంబానికి రూ.8.25లక్షల రిలీఫ్

- భార్యకు ప్రభుత్వ ఉద్యోగం
- దళిత నేత నీలం వెల్లడి

రిలీఫ్ పత్రాలను చూపుతున్న నీలం

విశాలాంధ్ర-ఒంగోలు : అగ్రకుల రెడ్డి హంతకులు పేర్నమిట్టలో హత్య చేసి కేసు మాఫీకి యత్నించిన ఘటన లో దళిత నేత నీలం కృషితో భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.8.25 లక్షల రిలీఫ్ మరియు ఎస్సీ ఎస్టీ మంత్లీ పెన్షన్ మంజూరైంది. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పేర్నమిట్ట గ్రామం లో 2020 ఫిబ్రవరి 24న ఎస్సీ మహిళ జ్యోతి తన భర్త జీవన్ కనిపించటం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జ్యోతి అను ఎస్సీ మహిళలు తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా ఒంగోలు తాలూకా పోలీస్ లు క్రైమ్ నెంబర్ 33/2020 మాన్ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మరుసటి రోజు జీవన్ శవం పేర్నమిట్ట కొండపై జీవన్ ఇంటి పక్క చర్చి సందులో కనిపించిందన్నారు. ఎస్సీ ఎస్టీలు హత్యకు గురైతే పోలీస్‌లు హంతకులను పట్టుకోలేక ఆ కేసులను అండ్ డిటెక్టెడ్‌గా చేస్తే హత్య కేసుల్లో ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం రిలీఫ్ ప్రభుత్వ ఉద్యోగం పెన్షన్ మంజూరు చెయ్యాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు మార్చిలో విజ్ఞప్తి చేశామని నీలం పేర్కొన్నారు. అందుకు సంబంధించిన జీవో కాపీలను తను గతంలో ఇప్పించిన మన్నం ప్రసాద్, రఘురామయ్య హర్యానా కేసుల్లో అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఉత్వరులు రిఫరెన్స్‌గా చూపించామన్నారు. ఎట్టకేలకు చింతగుంట్ల జీవన్ హత్య జరిగి నలభై నాలుగు నెలల తరువాత పోలీస్‌లు హంతకులను పట్టుకోలేక కేసు క్లోజ్ చేసి ఈ కేసుకి ఎస్సీ ఎస్టీ యాక్ట్ కూడా వర్తించదని పోలీస్ వారు కలెక్టర్‌కు లెటర్ పెట్టారు. దళిత నేత నీలం నాగేంద్రరావు గతంలో జరిగిన సుమారు 150 కేసుల్లో ఉద్యోగాలు ఇప్పించిన అనుభవంతో చింతగుంట్ల జీవన్ హత్య కేసులో సాధారణ రిలీఫ్ ఫైల్ కూడా కోర్రిలు వేసే జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేత జీవన్ భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం రిలీఫ్‌రూ.8.25లక్షలు, సెంట్రల్ డీఏ తో కలిపినా నెలకు రూ.5 వేల రూ. పెన్షన్ మంజూరు చేసినట్లు నీలం తెలిపారు.

మంచంపట్టిన పాలుట్ల

- గిరిజన గూడెంలో విజృంభించిన విషజ్వరాలు, మలేరియా
- పది రోజుల్లో ఇద్దరు మహిళల మృతి
- వైద్యం అందక జ్వరపీడుతుల అవస్థలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజన గూడెంలో మలేరియా, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పది రోజులు వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. 20 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. వారికి వైద్యం అందగా ఇబ్బందులుపడుతున్నట్లు గూడెం వాసులు తెలిపారు. పాలుట్ల గూడేనికి చెందిన నేనావత్ నానిబాయ్‌కి రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. మంగళవారం గూడెం లో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు వద్దకు తీసుకెళ్లారు. సెలైన్ ఎక్కిస్తుండగా ఆమె మృతి చెందినట్లు భర్త తులసీ నాయక్ తెలిపారు. దేవుడంలో వారం రోజుల క్రితం దేశావత్ పాపిడిభాయ్(50) జ్వరంతో వైద్యం అందక మృతి చెందింది. మెరుగైన వైద్యం కోసం వెళ్లాలంటే అడవిలో 40 కీ.మీ ప్రయాణం చేయాల్సిందేనని గిరిజనులు వాపోతున్నారు. అత్యవసరంగా చికిత్సలు పొందాలంటే జీబుకు 5వేలు అద్దె చెల్లించి నాలుగు గంటలు ప్రయాణిస్తే వైద్యశాలకు చేర్చుతారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

పాలుట్ల పేరుతో పీహెచ్‌సీ ఉన్న :-
పాలుట్ల గిరిజన గూడెంకు పిహెచ్‌సీ మంజూరు చేసి 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి రోడ్డు సౌకర్యం లేని కారణంగా ఏర్పాటు చేయలేదు. పాలుట్ల పేరున ఉన్న పీహెచ్‌సీని మైదాన ప్రాంత గ్రామం గంజివారి పల్లెలో నిర్వహిస్తున్నారు. గంజివారిపల్లెకు పాలుట్లకు మధ్య దూరం 38 కీ.మీ ఉంటుంది. వైద్యులు, వైద్య సిబ్బంది యర్రగొండపాలెంలో నివాసం ఉంటూ నెలకు ఒక పర్యాయం పాలుట్ల వెళ్లి శిబిరం ఏర్పాటు చేసి వస్తుండటంతో సక్రమంగా వైద్య సేవలు అందక గిరిజనులు అవస్థ పడుతున్నారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి వామి దగ్ధం

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక ఎస్సీ పాలెంలో ఎనుముల పెదలక్షమయ్యకు చెందిన వరి గడ్డి వామి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఒక్కసారిగా పెద్దగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించి మంటలు అదుపు చేయడంతో పెద్ద గండం తప్పింది. బాధితుడు పెద్ద లక్ష్మయ్య 60 వేల రూపాయలుతో 3 ట్రాక్టర్లు వరిగడ్డి కొనుగోలు చేసి వామిగా ఏర్పాటు చేసుకున్నాడు వరిగడ్డి వామి సమీపంలో పిల్లలు దీపావళి టపాసులు కాలుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు గడ్డి భూమిపై పడ్డాయి. వెంటనే గమనించిన లక్ష్మయ్య మరికొందరు సహాయముతో మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగి ఉంటే పక్కనే ఉన్న అనేక పొగాకు పాకాలు అగ్నికి ఆవుతాయి. భారీ నష్టాన్ని సంభవించేవి కొంత మేర వరిగడ్డి నష్టం జరిగినా పెను ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బానిసత్వ సంకెళ్ల నుండి బయటకు రండి

పాదయాత్ర చేస్తున్న విజయ్ కుమార్

ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయ్ కుమార్

విశాలాంధ్ర-ముండ్లమూరు : బానిసత్వం సంకెళ్లు నుండి బయటకు వస్తే విముక్తి కలుగుతుందని మాజీ కలెక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని పోలవరం శంకరాపురం గ్రామాల మీదుగా బుధవారం ఐక్యత విజయ పదం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నేటికీ పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతూ ఉండటం జరుగుతూనే ఉందన్నారు. వాటిని అధిగమించడానికి యువతీ యువకులు ఎదిరించేందుకు నడుం బిగించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయ దృష్టికి తీసుకువచ్చారు. కొందరు వృద్ధులు అర్హత ఉన్న పింఛన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాతపూడి మోజేష్ రత్నం రాజు, దార్ల కోటేశ్వరరావు, గోపన బోయిన వెంకటరావు, పోలవరం సర్పంచి నంబూరి లీలమ్మ యేసు, పాస్టర్ అనపర్తి జాన్ ప్రభాకర్, నంబూరు దాసు, నంబూరి అభిషేలం, అత్యాల రవికుమార్, అత్యాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు ముఠాపై చర్యలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఉద్యోగం ఆశ చూపి నకిలీ డాక్యుమెంట్లు చూపి యువత నుండి అధిక మొత్తంలో దోచుకుంటున్న ముఠాపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితుడు కుంచాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనం నందు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలు 2021వ సంవత్స రంలో ఒంగోలు నీలం పాలంకి చెందిన ముత్తన నాగరాజు, ముత్తన శ్రీని వాస్ మరి కొంతమంది కలిసి నాగ్ మాన్ పవర్ అనే సంస్థను ఏర్పాటు చేసి గవర్నమెంట్‌కి సంబంధి ంచిన ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇస్తారని తనతో పాటుగా ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌కు చెందిన కొట్టే కృష్ణమూర్తి అను అతన్ని, మిత్రులను నమ్మించి సుమారు రూ.2 కోట్ల 70 లక్షలు వసూలు చేశారన్నారు. దీనికి గాను నకిలీ ఆప్కాస్ ఉత్తర్వులు మరియు ఏజెన్సీ ఆర్డర్స్, ప్రభుత్వ అధికారుల పేర్లతో సంతకాలు చేసిన ఫేక్ డాక్యుమెంట్లను చూపించి దశల వారీగా డబ్బులు తీసుకొని మోసం చేశారన్నారు. ఈ క్రమంలో నాగరాజు మరియు ముత్తన శ్రీనివాస్ భాగస్వామి అయినటువంటి శరత్ ఉరఫ్ ఆనంద్ అనే అతను నాగరాజు మరియు శ్రీనివాస్ చాలా డేంజర్ మనుషులు అని నీ ప్రాణం కూడా తీసేస్తారని చెప్పి, నిన్ను మర్డర్ చేయటానికి ప్లాన్ చేస్తున్నారని తనకు మెసేజ్ చేశారన్నారు. ఈ విషయం పై ఎస్పీకి స్పందనలో కలిసి విన్నవించుకున్నట్లు తర్వాత కూడా పోలీస్ వారిచే ఎటువంటి చర్యలు తీసుకోబడలేదన్నారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ నందు ఎఫ్ఐఆర్ నెంబర్ 513/2022 నమోదు చేయడం జరిగిందని నాగ్ మెన్ పవర్ సంస్థను మంగమూరు డొంక నుంచి మార్చి ప్రస్తుతం నెల్లూరు బస్టాండ్ నందు జై కిసాన్ అగ్రికల్చర్ సొసైటీ మరియు ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ పేరుతో అనేక మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేస్తూ ఉన్నార న్నారు. ముత్తన్న నాగరాజు మరియు శ్రీనివాస్ బాధితులు ప్రకాశం జిల్లా, పరిసర ప్రాంత జిల్లాలో కూడా మరింత మంది మోసపోయి ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో వాళ్లు కూడా ముందుకు వస్తారని సమాచారం దీనిని జిల్లా ఎస్పీ ప్రత్యేక కేసుగా పరిగణించి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేయగలరని నాతో పాటు మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలనీ కోరారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుంచాల వెంకటేశ్వర్లు

మాదిగలరా మేల్కొనండి

సమాన హక్కులకై ఉద్యమిద్దాం కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ఈ నెల 20న గుంటూరులో జరిగే "మాదిగలరా మేల్కొనండి సమాన హక్కులకై ఉద్యమిద్దాం" కరపత్రాలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు భూదాల ఆనంద్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాదిగ సోదరులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువజన నాయకుడు భరణి, ప్రవీణ్ కుమార్, చల్లగాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కులకై ఉద్యమిద్దాం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆనంద్

ప్రతి పేదవాడి ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని ముండ్లపాడు గ్రామపంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ కడప లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతీ ఇంట ఆరోగ్యం జగనన్న ఆరోగ్య సురక్షతోనే సాధ్యమని, రాష్ట్రంలో ప్రతీ ఇంటిని సౌభాగ్యంగా ఉండాలన్నదే జగనన్న ఆలోచనని, అనారోగ్యాన్ని తరిమికొట్టి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చేయాలనే జగనన్న ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండారి నోవెల్, వైద్యులు షేక్ నాయబ్ రసూల్, సుమయా, ఎంపీడీవో హేమలత, స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్,జేసిఎస్ కన్వీనర్ బి ఓబుల్ రావు,గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, వైస్ సర్పంచ్ శేషగిరి, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీపీ కడప లక్ష్మీ

ఈదర, ఆమంచిలకు జనసేనలో కీలక పదవులు

ఉమ్మడి జిల్లా నేతలకు జనసేనలో కీలక పదవులు
- క్రీయాశీలక సభ్యుల శిక్షణ విభాగం ఛైర్మన్‌గా ఈదర హరిబాబు
- రాష్ట్ర కార్యదర్శిగా ఆమంచి స్వాములు
- అభినందనలు తెలిపిన జనసేన కార్పొరేటర్ మలగా రమేష్

విశాలాంధ్ర-ఒంగోలు : ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలకు జనసేన పార్టీలో కీలక పదవులు వరించాయి. అధినేత పవన్ కల్యాణ్ నూతనంగా నియమిం చిన కమిటీలో ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఒంగోలు వాసి, మాజీ శాసన సభ్యులు, మాజీ జెడ్పి ఛైర్మన్ ఈదర హరిబాబుకి పార్టీలో క్రీయాశీలక సభ్యుల శిక్షణ విభాగం ఛైర్మన్ గా నియమితులైయ్యారు. చీరాల వాసి ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు) కి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులై య్యారు. ఉమ్మడి జిల్లావాసులు ఇద్దరికి జనసేనలోకి కీలక పదవులు రావడంపై జనసేన పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. జనసేన ఒంగోలు నగర అధ్యక్షులు, 38 డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ ఇరువురికి అభినందనలు తెలిపారు.

ఈదర హరిబాబు

ఆమంచిస్వాములు

నకిలీ డాక్యుమెంట్స్, స్టాంప్స్ కేసులపై దర్యాప్తు

- జిల్లా ఎస్పీ మల్లికగర్గ్
- నకిలీ దాక్యుమెంట్స్, స్టాంప్స్ కేసుల ప్రత్యేక టీం తో ఎస్పీ సమీక్షా సమావేశం

పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో ఇప్పటివరకు నమోదైన 12 నకిలీ డాక్యుమెంట్స్, స్టాంప్స్ కేసులపై ప్రత్యేక దర్యాప్తు టీం అధికారులతో జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో సమీక్ష సమావేశం నిర్వహించి ఆ కేసులకు సంబంధించిన సీ.డీ ఫైల్స్ క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు, సలహాలు తెలియ జేసారు. ఈ కేసుల్లో పోలీసు, రెవెన్యూ మరియు రిజిస్ట్రార్ వారితో కలిసి సమన్వయంతో లోతుగా దర్యాప్తు చేయాలని, స్థలాలు మరియు వ్యవసాయ భూముల పై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, డీకే, డెత్ మరియు ఇతర పత్రాలను సంబంధిత ఆఫీస్ లలో వెరిఫై చేసి వాటికి సంబంధించిన వాస్తవ యజమాన్యులు, డాక్యూమెంట్లను గుర్తించాలని, స్థలాలపై ఫేక్ డాక్యు మెంట్స్ ఎవరు సృష్టించారు, ఖాళీ స్టాంప్ పేపర్లు ఎంతమందికి అమ్మారో, వారికి ఉన్న లింకులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయో గించి గుర్తించి పూర్తి సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసి వారికి శిక్షలు పడేలా కృషి చెయ్యాలని పోలీస్ అధికారు లను ఎస్పీ ఆదేశించారు. కేసులకు సంబం ధించిన దాక్యుమెంట్ వెరిఫికేషన్ జరుగుతున్నదని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి అరెస్టు చేసి, ముద్దాయిలకు శిక్ష పడేలా మరియు బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు.

క్రోమా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ప్రచారం ప్రారంభం

- ఈ దసరాకి అద్భుతమైన ఆఫర్‌లు మరియు డిస్కౌంట్‌లు
- కిక్ ఇవి నుంచి విద్యుత్ వాహన బైక్‌లను గెలుచుకునే అవకాశం
- 25 అక్టోబర్ వరకు అన్ని క్రోమా స్టోర్‌లు సేల్ అందుబాటు

విశాలాంధ్ర-ఒంగోలు : దసరా పండుగను సందర్భాన్ని పురస్కరించుకుని, టాటా ఎంటర్‌ప్రైజ్ అయిన క్రోమా, తమ వార్షిక, భారీ 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ప్రచారం తో తిరిగి వచ్చింది. క్రోమా స్టోర్స్ మరియు క్రోమా అంతటా గృహోపకరణాలు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు మరియు మరిన్ని విభాగాలలో డీల్‌లు మరియు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆఫర్‌లు 25 అక్టోబర్ 2023 వరకు అందుబాటులో ఉంటాయి.క్రోమా నుండి కొనుగోలు చేసే కస్టమర్‌లు స్టోర్‌లలో లక్కీ డ్రా ద్వారా కిక్ ఇవి ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లను గెలుచుకునే అవకాశం ఉంది.క్రోమా రాష్ట్రవ్యాప్తంగా 13 ప్లస్ స్టోర్‌లు మరియు నెట్‌వర్క్‌ను కలిగి ఉంది.రాష్ట్రంలోని శక్తివంతమైన కమ్యూనిటీల నుండి అందుతున్న అద్భుతమైన స్పందన ద్వారా మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గరిష్టంగా 15% వరకూ క్యాష్‌బ్యాక్, రూ. 20,000 వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు మరియు 24 నెలల వరకు సులభమైన ఇఎంఐ పొందండి. తమ వీక్షణ అనుభవాన్ని మెరుగుపరచాలని చూస్తున్న వ్యక్తుల కోసం, 55, 65 లేదా 75-అంగుళాల 4కె ఎల్ఇడి టివి తో వినోద ప్రపంచంలో మునిగిపోండి మరియు నెలకు కేవలం రూ. 2990తో ప్రారంభమయ్యే ఇఎంఐ ఎంపికలను ఆస్వాదించండి.క్రోమా-ఇన్ఫినిటీ రిటైల్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శిబాశిష్ రాయ్ మాట్లాడుతూ, "మేము మా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ప్రచారంతో దసరా వేడుకల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. ఈ పండుగ సీజన్‌లో, ఆంధ్రప్రదేశ్ అంతటా 13 స్టోర్‌లతో, మా వివేకవంతమైన కస్టమర్‌ల ఎలక్ట్రానిక్స్ షాపింగ్ అనుభవాన్ని సంపూర్ణం చేయడానికి మేము ఇక్కడ ఉన్నాము. మా వినూత్నమైన కస్టమర్ సేవ లతో పాటుగా ఒకే చోట విస్తృత శ్రేణి గాడ్జెట్‌లను అందుబాటులో ఉంచటం ద్వారా ఈ దసరా సీజన్‌ను ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా మలచాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని అన్నారు.కేవలం రూ. 13,499తో ప్రారంభమయ్యే సరికొత్త 5జి ఫోన్‌లతో కనెక్ట్ అయి ఉండండి మరియు సాంకేతిక ప్రపంచంలో ముందుకు సాగండి. అంతే కాదు, మీరు మా ఎంపిక శ్రేణి ఫోన్‌ల నుండి ఎంచుకున్నప్పుడు, మీరు కేవలం రూ. 49కి బ్లూటూత్ కాలింగ్ వాచ్‌ని కూడా సొంతం చేసుకోవచ్చు . టెక్ ఔత్సాహికుల కోసం, ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఐఫోన్ 15 , నెలకు కేవలం రూ. 2,246 నుండి అనుకూలమైన ధరతో ప్రారంభమవుతుంది. ఇది 24 నెలల ఇఎంఐప్లాన్.8 కిలోల 5 స్టార్ ఇన్వర్టర్ ఫుల్లీ ఆటోమేటిక్ టాప్ లోడ్ వాషింగ్ మెషీన్‌తో అనుకూలమైన సౌలభ్యం పొందండి, నెలకు ప్రారంభ ఇఎంఐ కేవలం రూ. 1799లో లభిస్తుంది. అదనంగా, ఎంపిక చేసిన పూర్తి ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్‌లపై రూ. 6000 వరకు 10% క్యాష్‌బ్యాక్‌ను పొందండి. క్రోమా 256లీటర్ల ఫ్రాస్ట్-ఫ్రీ ఇన్వర్టర్ రిఫ్రిజిరేటర్‌తో మీ వంటగదిని అప్‌గ్రేడ్ చేయండి, కేవలం రూ. 22990 నుండి ఇవి ప్రారంభమ వుతాయి. మీరు రూ. 28990 ఆకర్షణీయమైన ధరతో కన్వర్టిబుల్ 256లీటర్ల రిఫ్రిజిరేటర్‌ను కూడా ఎంచుకోవచ్చు.

ఎంఎంఆర్ ఆధ్వర్యంలో వర్షిత జన్మదినోత్సవం

చిన్నారులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రవాస భారతీయులు వంకాయలపాటి సాంబశివరావు, కవితలు కుమార్తె వర్షిత జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో బుధవారం నిర్వహించారు. వర్షిత మేనత్త కొమ్మి రాజేశ్వరి రమణయ్య దంపతుల ఆధ్వర్యంలో దేవుడు చెరువు వద్ద గల ఎం ఎం ఆర్ ఫౌండేషన్ కార్యాలయం నందు దీర్ఘకాలిక వ్యాధి బాధితుల చిన్నారుల మధ్య కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఎంఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మక్కెన ధామస్ మాట్లాడుతూ వర్షిత కుటుంబ సభ్యులు వర్షిత జన్మదిన వేడుకలను ఇలా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త చిన్నారుల నడుమ జరుపుకోవటం సంతోషమన్నారు. అంతే కాకుండా చిన్నారులను ఆదుకునేందుకు ముందుకు రావటం అభినందనీయమన్నారు. సంఘ సేవకులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వర్షిత 15వ పుట్టినరోజు సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు నూతన వస్త్రాలతో పాటు నెల రోజులకు సరిపడా బియ్యము నిత్యవసర వస్తువులు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలతో పాటు వారికి తోడు వచ్చిన అందరికీ పౌష్టికారంతో కూడిన భోజనం ఏర్పాటు చేశారు. వర్షిత మేనత్త కొమ్మి రాజేశ్వరి మాట్లాడుతూ మా కుటుంబంలో పుట్టిన రోజులు పెళ్లి రోజులు ముఖ్యమైన రోజుల్లో ఆర్భాటాలు పోకుండా సేవా కార్యక్రమాలు జరుపుకుంటామని తెలిపారు. అనంతరం శివం ఫౌండేషన్ నిత్య అన్నదాన సంచార వాహనం ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో 300 మందికి పైగా అనాధలకు అన్నదానం చేశారు. ఈ సేవా కార్యక్రమాలలో సూర్య శ్రీ దివ్యాంగుల ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష, రచయిత డాక్టర్ మొగిలి దేవ, గాయకుడు నూకతోటి శరత్ బాబు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి. మారెళ్ళ రాజేశ్వరి. అరుణ. శ్రీదేవి. ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ డి.జయలక్ష్మి, గిరిజ వాణి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ రోజు మధుర మీనాక్షి అవతారం

విశాలాంధ్ర-గిద్దలూరు : దేవి శరన్నవ రాత్రుల సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమే శ్వరి అమ్మవారిశాలలో బుధ వారం నాలుగో రోజు మధుర మీనాక్షి అవతా రంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచి బారులు తీరి అమ్మవారిని దర్శించు కున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ కమిటీ తీర్థప్రసాదాలను అందజేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

జైలులో ఆహార పరీక్ష చేస్తున్న హరీష్‌కుమార్ గుప్తా

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా కారాగారము యొక్క భద్రత దృష్ట్యా బుధవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఏపీ కరెక్షనల్ సర్వీసెస్, ఆంధ్రప్రదేశ్ హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు రేంజ్ కారాగార ఉపశాఖాధికారి డాక్టర్ యం.వరప్రసాద్,జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ ఒంగోలులోని జిల్లా జైలును సందర్శించారు. జిల్లా కారాగారం ఆవరణములను, ముద్దాయిల బ్యారక్‌లను, జైలు హాస్పిటల్ తదితర అన్ని ప్రదేశాలను తిరిగి పరిశీలించారు. అక్కడ ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి యొక్క నేర వివరాలు మరియు స్థితిగతులను అడిగి తెలుసు కున్నారు. జైలులో వారికి కల్పిస్తున్న మౌలిక వసతులు, సమస్యలు, ఉచిత న్యాయ సహాయం గురించి ఆరా తీశారు. అంతర్గత భద్రతపై జైలు అధికారులతో మాట్లాడి ఖైదీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రత లోపాలు లేకుండా చూసుకోవాలని, ఎలాంటి భద్రతా సమస్య ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. జైలు అంతర్గత భద్రతపై, ఖైదీలలో పరివర్తన కోసం తీసుకోవ లసిన చర్యలపై జైలు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. జిల్లా కారాగారంలో ముద్దాయిలు కొరకు ఏర్పాటు చేసిన ఆసుపత్రి మరియు మహిళా ఖైదీల బ్లాక్‌లు పాత భవనములు అయినందున వాటికి సంబంధించిన మరమ్మత్తులు, పునర్నిర్మాణ పనుల గురించి, తగిన వసతులు ఏర్పాటుపై జైలు అధికారులతో చర్చించారు.

పల్నాటి ఆశయాలు ముందుకు తీసుకెళ్ళాలి

విశాలాంధ్ర-ఒంగోలు : సీనియర్ పాత్రికేయులు, సామాజిక కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టుల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పల్నాటి నాగేశ్వరరావు 5వ వర్ధంతి సభను ఒంగోలు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టుల యూనియన్ (ఆపేజు) ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు మల్లీశ్వరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా ఒంగోలు నగర కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత పాల్గొని మాట్లాడుతూ విలేకర్లతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించే వారని కొనియాడారు. అలాగే విలేకర్లు కూడా పల్నాటి నాగేశ్వర రావు లాగానే స్వచ్ఛందంగా సేవా కార్యక్రమలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మీసాల శ్రీనివాస్ మాట్లాడుతూ పల్నాటి జర్నలిస్టుల కష్ట సమయంలో నేను ఉన్నానని, ముందు ఉండేవారని తెలిపారు. పాత్రికేయ వృత్తిలో ఎన్నో ఇబ్బందులను చూసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేవిధంగా చేసేవారని కొనియాడారు. పల్నాటి నాగేశ్వరరావు 5వ వర్ధంతి సభ నిర్వాహకులు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మేకపాటి మాల్యాద్రి మాట్లాడుతూ నా స్నేహితుడని స్మరించుకోవడానికి ఈ సభను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు నా మిత్రుడు నాగేశ్వరరావు చేసిన సేవా కార్యక్రమాలను ఎప్పటిలాగానే కొనసాగిస్తా మని వివరించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఉడతా రామకృష్ణ మాట్లాడుతూ పల్నాటి ఆశయాలు మా యూనియన్ స్ఫూర్తితో నెల్లూరు జిల్లాలో కూడా కొనసాగిస్తామని, అయనకు నెల్లూరు జిల్లా నాయకులతో ప్రత్యేక సంబంధాలు ఉన్నాయన్నారు. పల్నాటి స్ఫూర్తితో మా జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్ డి.వరప్రసాద్ తన మరణాంతరం తన దేహాన్ని నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు అప్పగించేందుకు అంగీకారాన్ని తెలిపారని పేర్కొన్నారు. అనంతరం పల్నాటి మిత్రులు, సహచర పాత్రికేయులు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కో-కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, విశాలాంధ్ర బ్యూరో ఇన్‌ఛార్జ్ అలుగుల సురేష్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వెంకట్రావు, డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ నుకతోటి రవికుమార్, బిసి నాయకులు అంజిబాబు,షేక్. కాలేష, శివాజీ, నెల్లూరు జిల్లా నాయకులు పి.జె. రమేష్ రెడ్డి, వరప్రసాద్, పిగిలం చక్రధర్, తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

సురక్ష శిబిరంలో మందులు అందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ తదితరులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : జగనన్న సురక్ష పథకంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. వినోదరాయునిపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఎంపిపి అంజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయటం జరుగుతుందన్నారు.పేద బడుగు బలహీన మధ్యతరగతి వర్గాల వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. పైసా ఖర్చు లేకుండా గ్రామంలోనే కార్పొరేట్ వైద్యం అందిస్తున్న గొప్ప మానవతావాది జగన్ అని కొనియాడారు. శిబిరంలో వైద్య సేవలను పరిశీలించారు. మందులు అందజేశారు. తొలుత స్వాతంత్ర సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి ఎంపీపీ అంజమ్మ వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, ఎంపీటీసీ పొద పవన్, సర్పంచ్ ఘట్టమనేని అశోక్ ,వైసిపి నాయకులు పోలినేని కోటేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, తోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కమల్‌హాసన్‌ను మించిన నటుడు'బాలినేని'

-జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు రియాజ్ ధ్వజం

ఒంగోలు ఫోటో:21: మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్

విశాలాంధ్ర-ఒంగోలు : కమల్‌హాసన్ ను మించిన నటుడు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ తెలిపారు. స్థానిక జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ఒంగోలులో వెలుగు చూసిన నకిలీ స్టాంపుల కుంభకోణం మీద, భూ దందాల మీద విరుచుకుపడ్డారు. ప్రకాశం జిల్లా తేల్లి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి భూ దందాలు చేపించేది ఆయనే మళ్లీ ఏమి తెలియనట్టు కమలహాసన్ నటన చేసేది ఆయనే, ఇప్పటికైనా బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఒకటి గ్రహించాలి మీ నటనకు ఇప్పటిదాకా ఒంగోలు ప్రజలు మోసపోయారు. ఇంక మీద ఆ ఆటలు చెల్లవు, ఇప్పటివరకు మధ్యతరగతి వారు ఒంగోలులో రూపాయి రూపాయి దాచుకొని కొనుక్కున్న స్థలాలను కూడా మీరు మీ అనుచరులు చేత ఆక్రమించి, వారిని ఇబ్బంది పాలు చేయడం ఎంతవరకు సబబు, మీరు చేసిన పనులకు కర్మఫలం అనుభవించుక తప్పదన్నారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏర్పాటు కాబోయే ప్రజా ప్రభుత్వంలో మీ అక్రమాలను బయటపెట్టి మిమ్మల్ని, మీ అనుచరులని జైలుకు పంపించడం మాత్రం తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, రాయని రమేష్ బాబు, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడుసుమల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ఆరోగ్య రక్ష ధ్యేయం

విశాలాంధ్ర-ఒంగోలు : పేదల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎపి ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. ఒంగోలు సెయింట్ జెవియర్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల.అశోక్ బాబు పాల్గొన్నారు. మెడికల్ క్యాంపు జరుగుతున్న తీరు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.పేషెంట్లకు అవసరమైన వైద్యం అందిస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ వైద్యం, కార్పొరేట్ మందులు మన ఇంటి వద్దకే సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారని పేషెంట్లు సంతోషంగా చెప్పడంతో డాక్టర్ యాదాల.అశోక్ బాబు గారు ఆనందం వ్యక్తం చేశారు. పేదవారందరూ ఆరోగ్యంగా ఉండేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్యశ్రీ కార్యక్రమం చేపట్టారని,పేదవారు అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు మన గ్రామంలోనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి కార్పొరేట్ డాక్టర్ల ద్వారా మనకి వైద్యం చేయించడం ఎంతో సంతోషకరమని డాక్టర్ యాదాల.అశోక్ బాబు మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ అభిజ్ఞ,ఏ ఎన్ఎంలు ,ఆశలు ,వాలంటీర్లు, పాల్గొన్నారు.

ఊరు అభివృద్ధి చెందాలంటే తెదేపాకు ఓట్లు వేయండి

మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ప్రాంతంలోని ఊర్లు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కోరారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీలోని చింతలపాలెం ఎస్సీ కాలనీ, గడ్డమీదిపల్లి కనిగిరి మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, బిజ్జమవారిపల్లి, వెంకటేశ్వరపురం గ్రామాల్లో మన 'ఊరు మన ఉగ్ర' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ అహ్మద్, గుడిపాటి ఖాదర్, కోట సురేష్ బాబు, రీటా ఫయాజ్, పార్వతి ఇతర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రగతి రథసారథి సీఎం జగన్ మోహన్‌రెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొని వైద్యులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ సావిత్రి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క పేదవాడు ఇబ్బందులు పడకూడదని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. అలానే సీఎం జగన్మోహన్ రెడ్డి ఇంటి వద్ద వైద్యం అందించాలని జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎంపీపీ సావిత్రి అన్నారు. అలానే ఈ వైద్య శిబిరంలో రోగులకు మేలైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు తగిన సూచనలు చేశారు.అనంతరం ఆమె కూడా వైద్య పరీక్షలు చేయించుకొని వారి చేతుల మీదుగా మందులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,వైస్ ఎంపీపీ శోభ, తాహసీల్దార్ ఎస్ హరిబాబు, ఎంపీడీవో జీవీ. కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇన్చార్జ్ కస్తాల బాలాజీ,మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబి,ఆదినారాయణరెడ్డి, బెంజిమాన్, మద్ది తిరుపతయ్య, సచివాలయ సిబ్బంది,మండల అధికారులు, వాలంటీర్స్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాదిగల మహాసభ కరపత్రిక ఆవిష్కరణ.

విశాలాంధ్ర-వెలిగండ్ల : మాదిగల విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని వెలిగండ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు మాట్లాడుతూ నవంబర్‌లో శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించే విశ్వరూప మహాసభకు మండలం నుండి పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. ఈ క్రమంలో పలు గ్రామాలను సందర్శించి మాదిగల విశ్వరూపం మహాపాదయాత్ర కరపత్రాలను కంకణం పాడు, అగ్రహారం, జిల్లాలపాడు, మొగులూరుపల్లి, పందువ నాగులారం, రాళ్లపల్లి, ఇమ్మడి చెరువు, రంగనపల్లి పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జెపి రాజు, వైసీపీఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, కుమ్మరి కుంట జకరయ్య, కుమ్మరి కుంట ఇశ్రాయేలు, ఇసాక్, ఆదాము, జుట్టుకే ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా వైఎస్సార్ భీమా

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : వైఎస్సార్ బీమా పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు మాచవరంలో నివసించే గాయం వెంకటరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. వైఎస్సార్ భీమాకు అర్హులైనందున నామిని అయిన భార్య శివమ్మకు కౌన్సిలర్ పోతిరెడ్డి రాజశేఖరరెడ్డి చేతులు మీదుగా వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 వేలును మట్టి ఖర్చుల నిమిత్తం అందచేయడం జరిగింది. మిగిలిన క్లైమ్ మొత్తం రూ.90 వేలను నామిని ఖాతాకు త్వరలో జమ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో శనగల బుకింగ్

- ఏవో వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని రైతు సోదరులు అందరూ ఈ ఏడాది రవి సీజన్ కింద శనగ పంటను సాగు చేసుకునే రైతులు తమ వెంట పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు మరియు మొబైల్ నెంబర్లతో రైతు భరోసా కేంద్రాలలో పేర్లను బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు 20 కేజీలు గల రెండు బ్యాగులు అనగా ఒక్కొక్క బ్యాగు ఖరీదు 972 రూపాయలు చొప్పున ప్రభుత్వం తరఫున రైతులకు విక్రయించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సకాలంలో పేర్లను నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి వెంకటేశ్వర్లుతో పాటు తర్లుపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు డి గోవిందభాష, రైతులు పాల్గొన్నారు.

సురక్ష పథకంతో మెరుగైన వైద్య సేవలు



విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి యాదల అశోక్ బాబు అన్నారు బుధవారం వినోద రాయునిపాలెం లో నిర్వహించిన జగనన్న సురక్ష మెడికల్ క్యాంపును ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదల అశోక్ బాబు, జడ్పిటిసి యాదల రత్న భారతి పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరును వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు సీఎం వైఎస్ జగన్ వెయ్యి దాటిన ఎలాంటి వ్యాధులుకైనా ఆరోగ్యశ్రీ లో అవకాశం కల్పించి పేదల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామికి కుంభాభిషేకం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని ముండ్లమూరి వారి పాలెం అడ్డరోడ్డు పచ్చడొంక వద్ద ఉన్న అభయాంజనేయ స్వామికి బుధవారం టీటీడీ వేద పండితులు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అవినాష్ స్వామి, కోదండ రామాచార్యులు కుంభాభిషేకం వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. ముండ్లమూరివారిపాలెం గ్రామానికి చెందిన మండ మల్లికార్జున సుమారు 12 లక్షల రూపాయలతో శ్రీ అభయాంజనేయ స్వామి వారికిఆలయాన్ని నిర్మించారు. మంగళవారం నుండి వేద పండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, గణపతి హెూమం, శ్రీ సీతారామహోమ హోమాలు, బుధవారం పూర్ణాహుతి, అభయ ఆంజనేయ స్వామి వారి వాయు పునప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా నిర్వహిస్తానని అన్నారు. అనంతరం విచ్చేసిన వేలాది భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని కాకుటూరు వారిపాలెం గ్రామంలో బుధ వారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలకు బ్యాంక్‌లో ఉన్న లోన్‌ల గురించి మరియు ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్‌ల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ నరేంద్ర మరియు కళాజాత బృందం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.